

# డార్వినిజమ్

''ది డన్స్ ఎట్ ది స్కూల్ ఆర్ ది వైజెస్ట్ ఇన్ ది వర్ల్డ్'' అని పాఠం మొదలైంది. ఛార్ల్స్ డార్విన్ అనే పెద్ద మనిషిగాబోలు చిన్నతనంలో బడిలో చదువులో వెనకబడివుండేవాడట. కాని అట్టి మొద్దబ్బాయే పెద్దయాక ఒక సిద్ధాంతం వ్రాసి ప్రపంచ ఖ్యాతి పొందాడు. ఆయన పరిణామ సిద్ధాంతం ప్రకారం మనుషులంతా కోతులుగా పుట్టి మార్పు చెంది మనిషిగా అయినారు.

ఊరికే మాటలతో సిద్ధాంతీకరిస్తే ఒప్పుకోరు. ఋజువు చేయాలి. ఒక వోడలో చేతికింద పనివాడుగా పంపమనీ, సాయానికి మనుషులు తక్కువగా వున్నారనీ, ఓడ కప్తాను, పెద్ద డార్విన్ని అడిగాడు. ''మరీ మంచిది. వీడింటివద్ద వుండి యేమి చేస్తున్నాడు గనక ? కుండల్లో గుజ్జాల్ని తోలేస్తున్నాడంతేనా? గుజ్జం గుడ్డిదైనా దాణాకు తక్కువలేదని గుటుకూ గుటుకూ ప్లేటు నిండావున్నవన్నీ స్వాహా చేస్తున్నాడు'' అని కొడుకును సాయానికి పంపటానికి పెద్ద డార్విన్ ఒప్పుకున్నాడు.

డార్విన్ పోలికలూ మొహంగూడా, ఆయన వ్రాయబోయే థీసిస్‌లాగే వుండేవట. నుదురు యెత్తు. చిన్న కళ్లు లోపలికి వుండి ఆర్పుతూ వుండే వాడు.

అట్టి మొద్దబ్బాయి ప్రయాణంలో దోవలో ఓడ ఒడ్డు పట్టినప్పుడల్లా, అస్థుల్నీ, కంకాళాల్నీ, సేకరించాడు. వాటిని మూటగట్టి తన గదిలో దాచేవాడు.

ప్రాణులు చతుష్పాత్తులయాక నీటిని వదిలి భూమిమీదే తిరగటానికి అలవాటుపడ్డాయి. సీ పైరేట్సు నీటిమీది క్రూర జీవితానికి విసుగెత్తి తమ ఓడలు డెన్మార్క్ వద్ద లంగరు వేసి భూమి మీద జీవించసాగారు. వారే వైకింగులు.

భూమి మీద మొదట్లో చెట్లు బాగా వ్యాపించి వుండేవి. అడవులు, అరణ్యాలు దట్టంగా వుండేవి. చెట్టెక్కటం నేర్చి ఓ చెట్టు మీదనించి మరో చెట్టు

మీదికి యెగిరి దూకి, తోక కొమ్మకి చుట్టి వేలాడుతూ, పళ్లు, కాయలూ కోసుకు తినేవి. తోక బాగా పొడుగైంది.

అడవులు తరిగిపోయి ఆహారం తక్కువైంది. నాలుగు కాళ్లమీద తిరుగుతూ చెట్లు పాకే అవసరం లేక, వెనక్కాళ్ల మీద నిలబడి, ముందు కాళ్లు చేతులలాగా వుపయోగించి అందినవి కోసుకుని తినేవి. ఆ విధంగా వెనుక కాళ్లు పొట్టి అయినాయి. ముందువే బలంగా వుపయోగకరంగా అయినాయి. నరవానరం తయారైంది. ఆత్మరక్షణ కోసం సామూహిక జీవనానికి అలవాటు పడ్డాయి. క్రమంగా మెదడు యెదిగి వికసించి ఆహార సేకరణలో పదునెక్కింది. కాళ్లూ చేతులూ సమానంగా వుపయోగపడుతూ పాకే అవసరం లేక మానవుడు తయారైనాడు.

జలచరాల బొమికలూ, భూచరాల బొమికలూ పేర్చి చూపుతూ గబ్బిలం చేయి అయిదువేళ్లు పేర్చి చూపాడు. అలా ఋజువు చేసి సిద్ధాంతీకరించాడు. పరిణామం పొంది పొంది, వానరం నరుడుగా తయారైనాడు అన్నాడు డార్విన్. మేధావులూ, పండితులూ అంతా చూసి విని డార్విన్‌తో యేకీభవించారు. ఆయన్ని మెచ్చి మేకతోలు కప్పారు.

నాకు డార్విన్ సిద్ధాంతం నచ్చలేదు. ఆదికవి వాల్మీకి మహర్షి, అంతకంటె గొప్ప సిద్ధాంతం, కవిత్వ ధోరణిలో 'రామాయణం' అనే కవనం అల్లి విపులీకరించాడు. బాగా స్క్రిప్ట్స్ పఠనం చేసి, అర్థం చేసుకుని కవనం అల్లాడు.

ప్రతీ మనిషిలో, డార్విన్ సిద్ధాంతం అంగీకరించినా, కోతి స్వభావం వుంటుంది. ఆ స్వభావానికి పరోపకారం అనే అలవాటు చేయాలి. మనిషిగా మారుతాడు. తర్వాతమెట్టు భక్తి అనే జిజ్ఞాస కలిగించాలి. భగవంతుని తెలుసుకోటంలో ఆసక్తి పెరుగుతుంది. యోగ సాధన ద్వారా, ఆమనిషి దైవంగా

మారుతాడు. పూజనీయుడౌతాడు. అట్టి మానవులున్నారు అని గానం చేశాడు. ప్రజా శ్రేయస్సు కోసం పాటుబడటమే యోగం. ఏకాగ్రత ముఖ్యం.

హనుమ అనేవాడు యోగి. భక్తుడు. కుండలినీ యోగం నేర్చి తానే భగవంతుడైనాడు. పూజనీయుడై భక్తులను గూడా పొందగలిగాడు అని సిద్ధాంతీకరించాడు వాల్మీకి మహర్షి.

నాకు డార్వినిజం యెక్కడబడితే అక్కడ కనబడేది. మా అన్నేమో, అసభ్యంగా ప్రవర్తించేవాడిని ''క్రోతి, క్రోతి'' అనేవాడు. హైస్కూల్లోనే సహాధ్యాయులు కోతులల్లే కనబడేవారు. నాది కో యెడ్యుకేషన్. క్లాసులోనే వెకిలి చేష్టలు చేయటం చాలక, నేను నడిచి యింటికెళ్తుంటే, పళ్లికిలిస్తూ పక్కగా నడుస్తూ సైన్సు నోట్సు అడిగే వాడు ఒక హనుమంతుడు.

టీచర్స్ రూమ్‌లో బొత్తిగా పెట్టివున్న వ్యాసరచన పుస్తకాలు కెలికి నా పుస్తకం యెత్తుకుపోయేవాడొక మారుతి. యెదురుగా వచ్చి, ''నీ హృదయంలో నాకు చోటుందా ?'' అనేవాడొక ఆంజనేయుడు.

కళాశాలలో గ్రోనప్ జెంటిల్ మేన్ వుంటారనుకుని భ్రమపడ్డాను. లెక్చర్ వినటం మానేసి, బ్లాక్ బోర్డ్ వంక చూడక, గాలరీ హాల్లో, చివరి బెంచ్ మీద కూచుని, ''యింత లేసి కన్నులుండ తెరులెవ్వరి వేడెదు ?'' అన్నట్టు సన్నలద్వారా యేదో మాట్లాడే వాడొక వాయుపుత్రుడు. పక్కింటి వయసుకాడు నూరునోటు చూపుతూ చిల్లరడిగితే పవనతనయునిలాగా కనిపించేవాడు.

సీజన్ మారుతుంది. ఈతి బాధలు, అనారోగ్యంతో బాధపడుతూ, ఉచితంగా మాత్రలిచ్చే వైద్యుడయితే డబ్బు గుంజడని విని వెళ్తే, వాడు కోతిలాగా కిచకిచలాడాడు.

'' ఒక్క రోగీ ఫీజుకింద బెడ్డింగివ్వడు. మీద చేయి వేయనివ్వడు.

వుచితంగానయం చేయాలా? అల్లోపతి చదివినవాడున్నాడుగా యీ వీధిలోనే? వాడికి చూపించుకో నీ అసలు రోగం కుదురుస్తాడు. నీ ఒంపు సొంపులు చూపే దుస్తులూ నువ్వూనూ అని కళ్లు టపటపా ఆర్పుతూ లేచి వస్తుంటే పారిపోయినాను, కోతి కరుస్తుంది. నాచిన్నతనంలో మా పెత్తల్లి కూతురు, ''తోడు పడుకుందువుగాని రా'' అని తీసికెళ్లేది. దాని మొగుడు అడపాదడపా సినిమాలో పాత్ర లభించగానే, షూటింగ్ వున్నదంటూ, కోతి చెట్లమీద యెగురుతూ వెళ్లినట్లు, యెగురుకుంటూ ఆటోలో వెళ్లి రైలెందుకుని, జంక్షన్లో మారి మరో రైల్లో యెక్కి గమ్యం చేరేవాడు. మా అక్కకి నా యీడు కూతురున్నది. ఆ కూతురు తల్లి కన్నుగప్పి కోతిలాగా పోయి చెట్టెక్కుతుంది. జామపండు వెతికి కోసి ఆ కొమ్మమీదే కూచుని తింటుంది. అది చెట్టెక్కకుండా నా నెత్తి నెక్కించుకుని ఆడించాలి. లేదా నేలమీదే ఆడించాలి. రాత్రి తీసికెళ్ళేది.''

పొద్దున్నే లేచి పక్క దుప్పటి మడత పెట్టి నెత్తిన పెట్టుకుని యింటికొస్తుంటే కోతి వచ్చి నా చెయ్యి లాగి కరిచింది. పెద్దగా అరిచాను. మా చిన్న తాతపేరు దక్షిణామూర్తి. ''దచ్చి తాతయ్యా!'' అని కేకవేస్తే, ఆయన చేపాటి కర్రతో యింట్లోంచివచ్చి గురి చూసి కర్ర విసిరాడు. కోతి కాలుకి తాకింది. అది కుంటుకుంటూ, నా చెయ్యి వదిలేసి వెళ్లిపోయింది.

మా తాతయ్య వచ్చి కర్ర అందుకుని నన్నెత్తుకుని, చేతిమీద కోతి కరిచిన గంట్లు రక్తం చూశాడు.

''కోతిని కవ్వించావే చిట్టీ!'' అని నవ్వాడు.

'' కవ్వించలేదు తాతయ్యా'' అన్నాను.

''మందు వేస్తా'' అని యింట్లోకి తీసికెళ్లాడు.

గాయం కడిగి మందు రాచి పట్టీ వేసి తాళ్లవుయ్యాల తొట్టిలో కూచోబెట్టి వూపాడు.

2

అల్లోపతి వైద్యుడు గూడా, డిప్ప కళ్లూ, గద్ద ముక్కూ వాడు, చెప్పింది విని కోతిలాగే యికిలించాడు. జ్వరం రావటం లేదని సంతోషించాను. బిల్ యివ్వలేదని గమనించి, నా పెట్టె తీసి నేను దాచుకున్న కొత్త నాణేలన్నీ తీసి పోగుచేసి తీసికెళ్లి వైద్యుడి చేతులో పోశాను. 'ఆ కపి చానాతక్కపికీ అందవు పెన్గని యని చెప్పీ' అన్నట్టు నాణేల వంకే చూసి, నా వంక చూసి, డార్విన్ నిజం బైట పెట్టాడు. రామదర్శనమైన హనుమలాగా అమాంతం వడేసి పట్టి ముద్దులు కురిపించబోయాడు. భలే భయం వేసింది. వీడు కోతిలాగానే కాకుండా భల్లూకంలాగా వున్నాడు దేహదారుఢ్యంలో అనుకుని కుస్తీపట్టి, మల్లయుద్ధం చేసి ద్వంద్వ యుద్ధంలో గెలిచి యింటి కొచ్చి పడ్డాను.

నాకు మెడల్సూ యివ్వలేదు. హుర్రే హుర్రే అనేవారూ లేరు.

మా అమ్మ చింపాంజీ లాగా, మా అమ్మ పేరు హనివి, పళ్లు బైట బెట్టి, చిన్న కళ్లార్పుతూ, తిట్టుతూ, దూషిస్తూ, తప్పుపడుతూ మీదబడి జుట్టు పీకి గుద్దులు వేసింది. కర్రు కర్రుమని, కిచ కిచమని అదేదో కోతి భాష లంకించుకున్నది.

సముద్ర లంఘనం చేస్తూ సముద్రంలో పడిపోయాడు మా నాన్న. కోతులంటి విద్రోహులు, ఆయన తోలుతున్న విమానంలో బాంబు పెట్టారు, సరీగ్గా పసిఫిక్ మహాసముద్రం లంఘిస్తుండగా, విమానం పేలిపోయింది. సముద్రుడు గూడా నరవానరంలాగా అందర్నీ అట్టడుక్కి లాక్కుపోయాడు. యమబలం ఆయన కెరటాలకి. మా నాన్న శవం గూడా పైకి తేలలేదు. ఆ వార్త అందగానే మా అమ్మ నిప్పు తొక్కిన కోతిలాగ గంతు లేస్తూ, కల్లు తాగిన

కోతిలాగా విద్రోహులకు శాపనార్థాలు పెట్టి గుండు కొట్టించుకుని పైను పంచెకట్టి రవిక వర్జించింది. ఆవిడ వెనకాల పమిట దోపినా, కొంగు వేలాడుతున్నా తోకలాగే కనిపించేది నాకు. మా నాన్న శంకర భగవత్పాదుల పటం పూజించేవాడు.

''నాన్నా! ఆయన మనల్లేనే మనిషేగా. దైవం కాదుగా. పూజిస్తావేం? '' అని అడిగాను.

''దైవం కాదు గాని చిట్టీ! ఆయన సిద్ధాంతీకరించిన అద్వైత ప్రకారం ప్రపంచమంతా కోతులమయం. కోతిలేని చోటు లేదు. కొన్ని గుంభనగా వుంటే, కొన్ని బహిరంగంగానే తమ నైజాన్ని బైట బెడతాయి. చేతలద్వారా గూడాను'' అని విచారంగా చెప్పాడు మా నాన్న.

నాకు మా నాన్న మాటలమీద గురి కుదిరింది. గొప్ప సిద్ధాంతం వ్రాసి వ్యాప్తి చేశాడని, ఆ శంకరుని పటం ముందు కూచుని దణ్ణం పెట్టి, ''యెందుకు మా అమ్మ కోతిలాగా మారుతుంది గురూ ? మీదబడి రక్కటానికి వస్తుంది? నా గుడ్డలు చింపుతుంది?'' అని అడిగాను.

''నిన్ను పట్టుకున్న కోతి, యేదో రాలుస్తూ నిన్ను యేమారుస్తున్నది. తన చేతులో యేమీ వుంచటం లేదని, తన నైజం అరికట్టలేకపోవటం వల్ల నీకలా కనిపిస్తున్నది.''

''తన కోరిక తీరేందుకు తనే ఆ కోతిని ప్లీజ్ చేయచ్చుగా?'' అన్నాను.

''నీవూ కోతిలాగా మాట్లాడటం లేదు? తల్లిని అలా అనవచ్చా?'' అని యింక మాట్లాడలేదు శంకరుల వారు.

3

అల్లోపతి వైద్యుని పేరు మారుతీరావ్. అతనింట్లో అడుగుపెట్టగానే, నరవానరం లాగా భారీగా వున్న తల్లి, ఆమె పేరు అనసూయమ్మ, కొరకొరలాడుతూ కర్రు కర్రుమని అరుస్తూ పెద్దరాతి ఆయుధం పట్టుకుని చంపటానికి వచ్చింది.

తండ్రి కోతి ఒరాంగ్ టాంగ్‌లాగ వుంటాడు. ఆయన పేరు రాంబంటు. రకరకాల అరుపులు అరుస్తూ కుప్పిగంతులేశాడు.

"అవి టోపీ కోతులురా మారుతీ! అవి అందరి నెత్తినా టోపీ పెడతాయి. ఆ కోతుల గుంపులో చేరావేం? ఆ పిల్ల కోతిని మనమందలోకి తెచ్చావా? ఆ కోతి పిల్ల కాళ్లు విరక్కొడతాను. ఈ రాతి గదతో నా తల పగలగొట్టుకు చస్తాను. నీకు మాతృహత్యాపాతకం చుట్టుకుంటుంది. మన గుంపుపేరు రామదండు. ఆ కోతులు యే గుంపులో బడితే ఆ గుంపులో దూరగలవు. చెట్లెక్కటమే రాదు వాటికి, పళ్లు కోసి యింటికి తేవటం మాట దేవుడెరుగు." అని తల్లి అరుస్తుంటే, మారుతీరావు యిటూ అటూ గంతులేశాడు. తల్లి కోతి ఒక చెట్టు వూడల సాయంతో మరో చెట్టు మీదికీ నేలమీదికీ దూకుతూ, ఆ గదతో మారుతీరావు నెత్తిన మొత్తాలని చూసింది. పళ్లు బైటపెట్టి అరిచి నోరుతెరిచి భయపెట్టింది.

మారుతీరావు అందకుండా గెంతుతూ, ఇహీహీ అని పళ్లికిలించాడు.

" ఆ కోతిపిల్లేమో తన ఆహారం తనే సంపాయించుకుంటుంది. ఆ గుంపులోని కోతులు నన్నేం చేయలేవు. అసలు యే కోతి అయితే నేమిటి ? నీ తమ్ముడు అంజయ్య చేసే పన్లు బాగున్నాయా? కొబ్బరి బోండాలెత్తుకుపోనూ, ముగ్గిన సీతాఫలాలు తుంచుకుపోనూ, అరటి గెలలు కోసుకుపోనూ, అదేనా ఆహార సంపాదన? మా నాన్న తోటల్లో దొంగలాగా దూరటమేనా?" అని పరుగెత్తి చెట్లు పాకి పారిపోయాడు.

4

మారుతీరావుకి తను ముద్దులాడిన కోతిపిల్ల కంటబడలేదు. యేమైవుంటుందీ అని వనాలు అడవులు అన్వేషణ చేశాడు. చెట్ల చిటారు కొమ్మలెక్కి చూశాడు. చివరి కెలాగైతేనేం. అశోకవృక్షం కింద, రామా రామా అనే సీతాదేవిని హనుమ కనుగొన్నట్టు, ఒక గుహలో చిన్న కోతి కూననాడిస్తూ కంటబడింది. కూనకి పేలు చూస్తున్నది. వీపు గోకుతున్నది. మారుతీరావుని చూడంగానే, మర్కట కిశోరీ, తల్లి పొట్ట వాటేసుకున్నది. తల్లి పారిపోవాలని గుహద్వారం వేపు పరుగెత్తింది బిడ్డతో సహా. వానరంలాగా వున్న నరుడు గుహద్వారానికి నిండుగా అడ్డం నిలుచుని చేతులడ్డం పెట్టాడు. కళ్లార్పుతూ నిలబడిపోయింది బిడ్డతో సహా.

''మనం యెక్కడికీ పోక్కర్లేదు అంజీ! నువ్వున్న అడవిలోనే కావల్సినంత సంపదవున్నది ఆహారానికి లోపముండదు'' అన్నాడు.

గుహ వాసయోగ్యంగా చేశాడు. ఆహారం తెచ్చాడు. పవన్‌కుమార్‌కి గూడా చెట్లెక్కటం, పర్వతారోహణా సముద్ర లంఘనం తర్ఫీదివ్వసాగాడు. రెండో కోతి పేరు అంజనేయమ్మ. మూడో కోతిపేరు అనిల్ గ్రాండీ. నాలుగు మారుతీ కుమారి. సంఖ్యాబలం పెరిగి బలగం పెరుగుతున్నదని సంతోషించాడు మారుతీ రావు. పానకంలో పుడకలాగా ఒక కోతి తనగుంపును వదలి తిరుగుతూ దారితప్పి వచ్చి మారుతీ నిలయంలో దూరింది.

యేదో పాపమని ఆశ్రయమిచ్చి, పెద్ద పులులకి కోతి మాంసమంటే యిష్టం. నరమాంసం లాగే, నరరక్తం లాగే చాలా రుచి. చల్లారక ముందే స్వాహా, అని చంపుతాయని మారుతీ రావు అదరించాడు. ముద్దు చేశాడు. తాను తెచ్చిన ఆహారం దానికీ పంచాడు. కాని నిలకడమీద దాని సైకాలజీ తెలిసిపోయింది. తన ఆహారం తను సంపాయించుకోదు. చెట్లూ పాకదు.

కాయలూ దుంపలూ పళ్లూ అన్నీ యెత్తుకుపోయి ఆరగిస్తుంది. పిల్ల కోతుల్తో ఆడుకుంటుంది. మారుతీరావు రాగానే నెత్తినెక్కుతుంది. బుజం మీద కూచుంటుంది.

''దిగు జానకీ శోకనాశినీ! ఇదేం మర్యాద. వేరే కోతిని చూసుకోలేవూ? చాలా వున్నాయే? లేదా వేరే గుంపులో దూరు. నీతోక చాలా పొడుగున్నదే! బలంగా వున్నావు. చెట్లెక్కి నీతిండి నీవు తిను. చిన్న పిల్లలే చెట్లెక్కి పళ్లు కోసుకొస్తున్నారు'' అని బుజం మీది నించి లాగి కింద కూలేశాడు.

'' ఇక్కడ బాగాలేదు. నీ నెత్తిమీదే బాగుంది'' అని పళ్లన్నీ బైట బెట్టింది జానకీ శోకనాశని.

అంజి ఆ కోతిని లేవదీసి తోలేయాలని చూసింది.

''పోను. నన్ను వదులు. మారుతీరావుకి నీవంటి కోతులు చాలా వున్నాయి. నువ్వొకత్తవే ఆకర్షించానని గర్వపడుతున్నావు. కళ్లు నెత్తి కెక్కాయి నీకు. నేనూ అక్షహంతనీ, లంకాభయంకరినీ కనగలను. నువ్వెవరు నన్ను గెంటేందుకు? మారుతీరావు నాకు చిన్నప్పటి దోస్తే. నువ్వొచ్చి వాడికి విషపుదుంపలు పెట్టి మనసుదించేసి నానుండి వేరు చేశావు. తల్లికోతికీ తండ్రికోతికీ వెరిచి నీ గుహలో దాక్కున్నాడు. నేనూ గుంపును పెద్దది చేయగలను. నువేపో బైటికి. ఇక్కడ నీ కోసం యెవరూ బెంగపెట్టుకోరు'' అని లేచి మీదబడింది. మారుతీరావు ప్రాణం చాలుకొచ్చింది, వాళ్లిద్దర్నీ విడదీసేప్పటికి.

''నువ్వు వేరే గుహలో వుండు శోకనాశినీ. శ్రమించటం అలవాటు చేసుకో. ఆహారం సంపాయించుకో. నేను వచ్చి చూసిపోతూవుంటాను. నీ గుహలో నీ అక్షహంతను, లంకాభయంకర్నీ నువే సాకచ్చు'' అని పొర్లి పొర్లి నవ్వాడు.

''నువ్వు నాకు చెప్పాలా? నేను వేరే గుహ చూశాను. నాతోరా చూపిస్తా'' అని లాక్కెళ్లింది.

మారుతీరావు గుహలోదూరి చూస్తున్నాడు. యెక్కడా శుభ్రతలేదు. తినిపారేసిన తొక్కులూ, కొబ్బరి చిప్పలు కుళ్లిన పళ్లూ, విత్తనాలూ. ఈ లోపల శోకనాశిని పెద్ద బండరాయి దొర్లించుకొచ్చి, సుగ్రీవుని చెల్లెలులాగా, ఆ రాతిని గుహద్వారానికి అడ్డం పెట్టింది.

గుహకు యివతల చాలా సేపు కుప్పిగంతులేసి, 'యీ'మని నవ్వి వెళ్లిపోయింది జానకీ శోకనాశని.

గుహలో చీకటి దుర్గంధం భరించలేక, గాలిలేదు, మూడురోజులు ప్రయత్నించి మెదడు, శరీరబలమూ వుపయోగించి బండరాతిని దొర్లింపచేయగలిగాడు మారుతీరావు.

తమ నివాసానికి చేరితే, అక్కడెవరూ కనిపించలేదుగానీ, యెత్తైన చెట్టెక్కి శోకనాశని అన్నివేపులా చూస్తున్నది. పెద్దతోక వేలాడుతున్నది. కొమ్మమీదే గెంతుతుంటే, కొమ్మ వూగుతున్నది.

''నీ గుంపంతా పారిపోయింది. యెక్కడికి పోగలవు? నీపోలికలు చూసి పట్టేస్తా'' అని కర్రు కర్రుమని అరుస్తున్నది.

దూకి వస్తుందేమో శోకనాశిని అని మారుతీరావు చెట్టు బోదెచాటున నిలబడి అనుకున్నాడు.

''నయమే. దీని డార్వినిజం చాలా బాగా బైటబెట్టింది'' పొదల్లో దూరుతూ మాయమైనాడు.

తన గుంపుకోసం వెతికి వెతికి, దట్టమైన అడివిలోకెళ్లి, చెట్ల కొమ్మలమీద కర్రలతో గూడులాగా చేసి అందులో పిల్లల్ని సాకుతూ అంజి కనబడింది. కపీష్ అనే మొదటి కొడుకు కొమ్మలమీద గెంతుతున్నాడు. మారుతీరావును చూడగానే పిల్లకోతులు హుషారొచ్చి కర్రల యింట్లోంచి దూకి నేలమీద గంతులేశాయి. కపీష్ కొమ్మ మీదనించి దూకి వచ్చాడు.

'' ఇప్పుడు చల్లగా బాగానే వున్నది గానీ అంజీ! వర్షాకాలం రాగానే, దోమలూ, చీమలూ, ఈగలూ, రకరకాల కీటకాలు బాధిస్తాయి. గాలికీవానకీ నీ కర్రలగూడు కూలి కిందబడుతుంది'' అన్నాడు.

పిల్లలు వుత్సాహంతో అన్నీ తెచ్చి అందిస్తుంటే మారుతీరావు పెద్దబండీ తయారుచేశాడు. అరిటి నారతో, తాటినారతో, గోగునారతో బిగించాడు. చక్రాలు యిరుసు, వెదురు బద్దలతో టాపు, తాటి ఆకులు, కొబ్బరి మట్టలు, ఈతాకుల చాపా వేసి నార్లతో బిగించి దట్టంగా చేశారు. వాన పడినా లోపలికి రాదు. దాన్నిలాక్కెళ్లి ఒక బలమైన బోదెకు బిగించాడు. పిల్లలూ తల్లీ అందులో ఎక్కారు.

ఇలా చేస్తూ చెట్లెక్కి చూడగా యిక్కడో కొత్త కోతీ, అక్కడో కింగ్‌కాంగూ కనిపించాయి. అటవీ సంపద తరిగిపోతున్నది. శిశిరము ప్రవేశించింది.

శోకనాశిని గూడా మరోగుంపుతో కంటబడింది. నిదానంగా ఆలోచించటం వలనా వుత్కంఠవలనా శ్రమ పడటం వలనా మారుతీరావు మెదడు బాగా వికసించింది.

ఆహారం పడేస్తూ, పచ్చిగడ్డీ జనపమొక్కలూ పెరికి తెచ్చి తినిపించి రెండు యెద్దులను మచ్చిక చేశాడు. వీపుతట్టుతూ సావాసం చేశాడు. వాటిని

పిలుచుకొచ్చి, ఆట నేర్పుతున్నట్టు కాడి మెడమీద నిలిపి, తాడు మెడనించి లాగి కట్టి బండిలాగటం, యీలవేయగానే పరుగెత్తటం. పందెం కోసం పరుగెత్తటం నేర్పాడు. పందెంలో గెలిస్తే పందిరీ, కుడితీ, చిట్టూ తవుడూ తెచ్చి నీళ్లలో కలిపి యెదుట వుంచేవాడు రాతి పాత్రలో. సైంధవలవణం చెట్టుకానించి వుంచితే నాకేవి.

అంతా ప్లాన్ సిద్ధమైంది. చెర్నాకోల చేసి, తోలే చోట కూచున్నాడు మారుతీరావు. లోపల బలగం నవ్వుతుండగా, శివాళ్లు ఆడిస్తూ గజ్జెల పట్టెడ ఘల్లు మనగా బండి పరుగెత్తింది.

5

'' ఈ మండలం పేరేమిటి ?'' అన్నది పత్రికా విలేఖరి.

''కిష్కింధ'' అన్నాడు మారుతీరావు.

తాము దేనిని వదిలి వచ్చామని అనుకున్నారో అవి యిక్కడా ప్రత్యక్షమైనై. రకరకాల గుహలు చిన్నవీ పెద్దవీ. లోపల దీపాలు. నీటి యిబ్బంది లేదు. గుహల్లోకే నీరు గొట్టాలద్వారా వస్తుంది. దాపునే జీవనది వున్నది. అటవీసంపద లాగా, సంతా, దుకాణాలు, అన్నీ వున్నాయి. ఆ ప్రదేశం కొత్త పేరు సిటీ. పేరు మారినా కిష్కింధావాసులు డార్విన్ సిద్ధాంతాన్ని చిత్ర విచిత్రంగా ఋజువుచేస్తూ వుంటారు. వేషభాషలు మెరుగైనా, తోకలు లేకపోయినా నైజం అదే. దొంగతనాలు, రక్కుకోటం ఎట్సెటరా.

మారుతీరావ్ ఒక రామాలయం కట్టించాడు. మానవత్వం అలవడసాగింది. జిమ్ఖానా నడపటం, గురువులూ వారి కసరత్తూ చూసి సభ్యులు చేరారు. కుప్పిగంతులు పోయినాయి.

ఇపుడు కిష్కింధలో మానవుల సంఖ్య పెరిగింది. భజన నేర్చారు. పాటలు పాడటం వచ్చింది.

భజనకూటమి పెట్టుకున్నారు. తరతమ బేధాలు మరిచి, యెత్తైన దీపప్రమిద చుట్టూ భజన చేస్తూ లయబద్ధంగా ఆడుతూ గెంతుతూ తిరుగుతారు. చిరుతలు మోగిస్తారు.

మానవుల శాతం హెచ్చింది. యెక్కడైనా ఒకటీ అరా కోతి కనబడినా దాన్ని తెచ్చి బుద్ధి గరపి భజనకూటమిలో పాల్గొనేట్టు చేస్తారు.

సిటీ జనసమ్మర్దం పెరిగింది. మానవులు వృద్ధి జెందారు. రామాలయం కాక, ఆంజనేయుని గుడీ, మారుతీ అన్నసత్రం వెలిశాయి.

మానవులు హనుమజ్జయంతి అని తిరణాల పండగా జరుపుకుంటున్నారు. ఆంజనేయుని లీలలు నృత్యప్రదర్శన ద్వారా చూపుతారు.

యేమైనా, యెవరిలోంచి వచ్చినా, మానవజన్మే ఉత్కృష్టమైనది. యుగపురుషులు, అవతార పురుషులు, కారణజన్ములు, సార్థక జీవులూ పుడుతూనే వున్నారు.

కథా నిలయం
5246
శ్రీకాకుళం